గురుతర బాధ్యత గోరు ముద్ద

- మధ్యాహ్న భోజనానికి పెరుగుతున్న ఆదరణ
- పౌష్టికాహారంతో విద్యార్థుల్లో పెరుగుతున్న ఐరన్
- మూడేళ్లు పూర్తి అవుతున్న మహత్తర పథకం



జగనన్న గోరుముద్దను స్వీకరిస్తున్న విద్యార్థులు

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారు. బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలనే ఆశయంతో వారు చదువు వారి తల్లిదండ్రులకు భారం కాకూడదని అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక అందజేస్తున్నారు. దీనికి తోడు పిల్లలను ఆకర్షించేలా నాడు–నేడుతో పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దారు. జనవరి 21, 2020న జగనన్న గోరు ముద్ద పథకాన్ని ప్రారంభించి ప్రత్యేక మెనూ రూపొందించారు. ప్రతి సోమవారం కూరగాయల పలావ్, గుడ్డు కూర, వేరుశనగ చిక్కి, మంగళవారం పులిహోర, పచ్చడి, ఉడికించిన గుడ్డు, బుధవారం కూరగాయల భోజనం, బంగాళదుంప కుర్మా, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కి, గురువారం సాంబారు, ఉడికించిన గుడ్డు, శుక్రవారం ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, వేరు శనగ చిక్కీ, శనివారం ఆకుకూర, పప్పుచారు, తీపి పొంగలి మెనూలో పొందుపరచారు. అలాగే మంగళవారం, గురువారం, శనివారం రాగి జావా అందజేస్తున్నారు. దీంతో 95 శాతం మంది విద్యార్థులు గోరుముద్దను ఇష్టంగా తింటున్నారు.

మండల పరిధిలో 55 ప్రాథమిక, నాలుగు ప్రాథమికోన్నత, 16 ఉన్నత పాఠశాలలు ఉండగా, 9,773 మంది విద్యార్థులు ఉన్నారని విద్యాశాఖాధికారులు తెలిపారు. 62 పాఠశాలల్లో సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ సభ్యులు భోజనం తయారు చేస్తున్నారు. మిగిలిన 13 పాఠశాలలకు అల్లూరి సీతారామరాజు ట్రస్టు నుంచి మధ్యాహ్న భోజనం సరఫరా అవుతోంది. ప్రతి పాఠశాలలో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసి స్వచ్ఛనీటిని అందజేస్తున్నారు. వీటి పర్యవేక్షణకు ప్రతి మండలానికి ఇద్దరు మండల విద్యాశాఖాధికారులను నియమించడంతో పని బారం తగ్గింది.

ఎంతో రుచిగా భోజనం



మధ్యాహ్న భోజనం ఎంతో రుచిగా ఉంది. నిత్యం ఒక మెనో ప్రకారం భోజనం అందించడంతో ఆసక్తి పెరిగింది. స్నేహితులతో కలిసి భోజనం చేయడం ఎంతో ఆనందంగా ఉంది.

– నమ్మి భీమేశ్వరి, 9వ తరగతి, బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్, సామర్లకోట

పిల్లల్లో ఐరన్ శాతం పెరిగింది



భోజనంలో లోపం ఉంటే ఫిర్యాదులు స్వీకరించేలా ఒక ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేశాం. పోషక విలువతో కూడిన భోజనం తీసుకోవడం వల్ల విద్యార్థుల్లో ఐరన్ శాతం పెరిగిన్నట్లు ఆరోగ్య సురక్ష పరీక్షల్లో గుర్తించాం.

– తోటకూర సాయిరామకృష్ణ, హెచ్ఎం బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్, సామర్లకోట

తరచూ పర్యవేక్షణ



ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని తరుచూ తనిఖీ చేస్తున్నాం. మండలానికి ఇద్దరు ఎంఈఓలు ఉండటంతో ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపడానికి అవకాశం ఏర్పడింది.

– వై.శివరామకృష్ణయ్య, మండల విద్యాశాఖాధికారి, సామర్లకోట

క్లుప్తంగా

అరబిందో ఫార్మా సేవలు ప్రశంసనీయం



ఉప్పాడలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న అరబిందో ఫౌండేషన్ ప్రతినిధులు

కొత్తపల్లి: కేఎస్ఈజెడ్ ప్రాంతంలో అరబిందో ఫార్మా సేవలు ప్రశంసనీయమని సచివాలయాల మండల కన్వీనర్ ఉమ్మిడి జాన్ అన్నారు. మండలంలోని ఉప్పాడలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ నిధులతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. పిఠాపురం నియోజకవర్గంలో సుమారు రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మిడి జాన్ మాట్లాడుతూ ఉప్పాడలో ప్రజల ఇబ్బందులను ఎమ్మెల్యే పెండెం దొరబాబు అరబిందో ఫార్మా డైరెక్టర్లు నిత్యానందరెడ్డి, శరత్ చంద్రారెడ్డి దృష్టికి తీసుకువెళ్లారన్నారు. దీనిపై వారు సానుకులంగా స్పందించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. అరబిందో ఫౌండేషన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



ఆరోగ్య కార్డులను అందజేసిన హరిబాబు

సామర్లకోట: పేదలకు రూ.25 లక్షల వరకు కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందేలా ప్రభుత్వం ఆరోగ్య శ్రీ కార్డులను ప్రవేశపెట్టారు. ఈ మేరకు గురువారం స్థానిక 13వ వార్డులో ఆ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు ఆరోగ్య శ్రీ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ మేరకు ఈకేవైసీ చేయించారు. దీని ద్వారా ప్రభుత్వం గుర్తించి కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోవడానికి అవకాశం ఉంటుందని హరిబాబు తెలిపారు. ఈ నెల ఆరో తేదీన పెద్దాపురంలో నిర్వహించే సాధికార యాత్రను విజయవంతం చేయాలని సచివాలయ సిబ్బందికి, వలంటీర్లకు ఆయన సూచించారు.

ఏఐసీసీ రీజినల్ చైర్మన్‌గా జాన్



పెద్దాపురం రీజియన్ కమిటీ చైర్మన్‌గా ఉత్తర్వులు అందుకుంటున్న జాన్

పెద్దాపురం: ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ పెద్దాపురం రీజియన్ చైర్మన్‌గా వంకా జాన్ నియమితులయ్యారు. గురవారం నిర్వహించిన ఏఐసీసీ సభలో పెద్దాపురం రీజియన్ నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్షులు రెవరెండ్ డాక్టర్ రైమా జహువాలోనే, ఉపాధ్యక్షులు శామ్యూల్ బెన్నీ ప్రకటించారు. ఈ సందర్భంగా పెద్దాపురం రీజియన్ చైర్మన్‌గా వంకా జాన్, కార్యదర్శిగా స్టీఫెన్ చందు, కోశాధికారిగా నంగిన శామ్యూల్ సుదీప్, ఉపాధ్యక్షుడిగా లాజరస్, సహాయ కార్యదర్శిగా ఏ.చంటి, కార్యవర్గ సభ్యులుగా టి.మోజెస్ అభిషేక్, గోల్డ్‌స్టోన్, విజయ్‌కుమార్, రాజేష్‌కుమార్ లను నియమిస్తూ ఉత్తర్వులు అందినట్లు అధ్యక్షులు జాన్ తెలిపారు.

పీఆర్ ఒకేషనల్ ప్రిన్సిపాల్‌కు డాక్టరేట్

బాలాజీచెరువు: పీఆర్ వొకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ సాధనాల శాంతి రాజశ్రీకు ఆంధ్రా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. 'ఫ్రమ్ బీయింగ్ దళిత్ టు బికమింగ్ డైనమిక్ సెలక్టెడ్ వర్క్స్ ఆఫ్ దళిత్ ఉమెన్ రైటర్స్ ఏ స్టడీ' అంశంపై ప్రొఫెసర్ సోమలత ఆధ్వర్యంలో సిద్ధాంత వ్యాసం రచించారు. ఈ సందర్భంగా శాంతిశ్రీను కళాశాల అధ్యాపకులు, సిబ్బంది గురువారం అభినందించారు.

తుక్కు దుకాణంలో అగ్ని ప్రమాదం

కాకినాడ క్రైం: కాకినాడలో ఓ స్క్రాప్ దుకాణంలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. రేచర్లపేటలోని యూపీహెచ్‌సీని ఆనుకుని ఉన్న ఈ దుకాణ యజమాని జాకీర్ హుస్సేన్ తన సాధారణ కార్యకలాపాలలో భాగంగా గురువారం మధ్యాహ్నం పాత విద్యుత్ తీగలకు మంట పెట్టి రాగిని సేకరిస్తున్నాడు. గాలికి ఆ మండలు వ్యాపించి పక్కన ఉన్న వ్యర్థాలకు అంటుకోవడంతో అగ్ని కీలలు ఎగసిపడ్డాయి. స్థానికులు సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది మూడు ఫైర్ ఇంజిన్లతో చేరుకుని రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపుచేశారు. సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని సాలిపేట ఏడీఎఫ్‌వో సుబ్బారావు తెలిపారు. అగ్నిమాపక శకటాలు వచ్చేలోగా వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ రోకళ్ల సత్యనారాయణ బృందం సైతం మంటలను అదుపు చేసేందుకు శ్రమించారు.

హామీల అమలే లక్ష్యం



పిఠాపురంలో లబ్ధిదారులకు కొత్త పింఛన్లు అందజేస్తున్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబు

- కాకినాడ ఎంపీ వంగా గీత
- పిఠాపురంలో కొత్త పింఛన్ల పంపిణీ

పిఠాపురం: ఎన్నికల్లో హామీలు ఇవ్వడం గెలిచాక వాటిని గాలికొదిలేయడం టీడీపీ నేతల తీరు అయితే.. ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకూ నిద్ర పోకుండా పని చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కాకినాడ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. పిఠాపురంలో గురువారం ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన నిర్వహించిన కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లబ్ధిదారులకు ప్రభుత్వం పెంచిన రూ.3 వేల పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కసారి మాట ఇచ్చారంటే అది నెరవేర్చే వరకూ నిద్ర పోరన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్‌ను అంచెలంచెలుగా పెంచి ప్రస్తుతం రూ.3 వేలు ఇస్తున్నారన్నారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు మాట్లాడుతూ ప్రజారంజక పాలన అందిస్తున్న నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేసి చూపించారన్నారు. అనంతరం 90 మంది కొత్త పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి, వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబీ, తలిశెట్టి వెంకటేశ్వరరావు, బోను దేవ, ముమ్మిడి శ్రీనివాస్, కొత్తపల్లి బుజ్జి, పెదపాటి నాగేశ్వరరావు, ఖలీల్ షా, మొహిద్దీన్, మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఈసీ ఆదేశాలు పాటించాల్సిందే

ఆర్డీవో జేఎస్ రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ జేఎస్ రామారావు

పెద్దాపురం: ఎన్నికల కమిషన్ ఆదేశాలను కచ్చితంగా పాటించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జేఎస్ రామారావు అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ చాంబర్‌లో గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఎన్నికల సెక్టార్, జోనల్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలపై అధికారులు పూర్తి అవగాహన పెంపొందించుకోవాలన్నారు. నియోజకవర్గ పరిధిలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోలింగ్ కేంద్రాల నిర్వహణ ఉండాలని, దానికి తగ్గట్టుగా ఎన్నికల సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్నీ తమకు కేటాయించిన సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆయన అన్నారు. డీఎస్పీ లతాకుమారి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న నిబంధనల మేరకు పీఎస్‌ల వద్ద ఎటువంటి ఏర్పాట్లు ఉన్నాయి, ఎటువంటి ఏర్పాట్లు చేపడితే కేంద్రాల వద్ద భద్రత కట్టుదిట్టం చేయవచ్చో, ఎన్నికల నియమావళిని పాటిస్తూ సిబ్బంది పోలింగ్ కేంద్రాల నిర్వహణపై సమగ్ర నివేదిక అందజేయాలన్నారు. అనంతరం పలు అంశాలపై ఆర్డీఓ రామారావు సమీక్షించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జితేంద్ర, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, సీఐ రవికుమార్, ఎస్ఐ సురేష్, మున్సిపల్ మేనేజర్ జ్యోతి, సీడీపీఓ ఉష, ఉద్యాన అధికారి సుజాతతో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

విరబూసిన మామిడి చెట్లు



పిఠాపురం–ఉప్పాడ రోడ్డులో విరగబూసిన మామిడి చెట్టు

కొత్తపల్లి: వాతావరణం అనుకూలించడంతో ఈ ఏడాది నియోజకవర్గంలో మామిడి తోటల్లో పూత ఆశాజనకంగా ఉంది. పలు ప్రాంతాల్లో మామిడి చెట్లు ఇప్పటికే విరబూశాయి. గ్రామల్లో ప్రతిరోజూ ఉదయం తేనె మంచు పడడంతో రైతులు పూతను కాపాడుకునేందుకు అనేక క్రిమి సంహారక మందులు పిచికారీ చేస్తున్నారు. పూతపై మంచు ప్రభావం పడకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకొంటున్నారు. ఈ ఏడాది పూతతో పాటు దిగుబడి కూడా ఆశాజనకంగానే ఉండవచ్చని రైతులు చెబుతున్నారు. గ్రామాల్లోని వ్యవసాయాధికారులు రైతులకు సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష పుష్పార్చన



అమ్మవారికి నిర్వహించిన లక్ష పుష్పాల పూజ



ఆలయంలో అఖండ దీపారాధన

నేత్ర పర్వంగా దీపోత్సవం

సామర్లకోట: స్థానిక బెల్లమార్కెట్‌లోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో గురువారం భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మార్గశిర మాసం సందర్భంగా ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఉదయం విఘ్నేశ్వర పూజ, మహిళలచే కుంకుమార్చనలు జరిగాయి. రాత్రి అమ్మవారి లక్ష పుష్పాల పూజలు, అఖండ దీపారాధన, నీరాజన మంత్ర పుష్పం, ప్రసాద వితరణ చేశారు. పంచారామ క్షేత్రం దీపారాధన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దీపాలంకరణలో దీపాలను భక్తులు వెలిగించారు. ఆలయ పండితులు సన్నిధిరాజు సూర్యభాస్కరరావు, అంజిబాబు, భాస్కర్ శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ నాయకులు గ్రంధి వాసు, పెద్దిరెడ్డి శ్రీనివాసు, కారుకొండ వెంకటేశ్వరరావు, పెద్దిరెడ్డి సూర్యనారాయణ, బొండా సత్యనారాయణ, కంచర్ల తాతాజీ భక్తులకు సేవలందించారు.

అంధుల జీవితాల్లో వెలుగు బ్రెయిలీ



పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న విద్యార్థులు

పెద్దాపురం: అంధత్వం కల్గిన ప్రతి ఒక్కరి ఆశా స్వప్నం లూయిస్ బ్రెయిలీ అని శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాల నిర్వాహకుడు రాయవరపు వీరబాబు అన్నారు. మండలంలోని పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో బ్రెయిలీ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ సత్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో వీరబాబు లూయీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులతో కేక్ కట్ చేయించారు. పాఠశాల ఏఓ వేణు, బాబి, శివ, అప్పలరాజు, శ్రీనివాస్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నంది పురస్కార గ్రహీతకు సత్కారం



కుమార్‌బాబును సత్కరిస్తున్న సీతారామాంజనేయ నాటక మండలి దక్షిణామూర్తి

కాకినాడ రూరల్: గత నెలలో గుంటూరులో నిర్వహించిన నంది నాటకోత్సవాల్లో ఉత్తమ ప్రతినాయకుడిగా పురస్కారం అందుకున్న వైఎస్ కుమార్ బాబును సాటి కళాకారులు గురువారం సత్కరించారు. స్థానిక ఏపీఎస్పీ సీతారామాంజనేయ నాటకమండలి కళాకారుడైన కత్తిపూడికి చెందిన కుమార్‌బాబును ఏపీఎస్పీ ఎదురుగా సీతారామాంజనేయ మందిరం వద్ద నాటక మండలి వ్యవస్థాపకుడు ఎ.దక్షిణామూర్తి ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా కుమార్ బాబు మాట్లాడుతూ తాను స్వీయ దర్శకత్వం వహించి, నటించిన సీతా కల్యాణం నాటికలో ప్రదర్శనకు ఈ పురస్కారాన్ని గెలుచుకున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కళాకారులు శ్రీనివాస్, రామకృష్ణ, బాబూరావు, తురగా సూర్యారావు పాల్గొన్నారు.

బాలికకు సీఎం సాయం అందజేత



కనకమహాలక్ష్మికి రూ.లక్ష చెక్, పింఛన్ ఉత్తర్వులు అందజేస్తున్న నాయకులు

కరప: గ్రామ శివారు రామకంచిరాజునగర్ కాలనీకి చెందిన 12 ఏళ్ల గనిశెట్టి కనకమహాలక్ష్మికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రూ.లక్ష ఆర్థిక సాయం, పీహెచ్ పింఛన్ రూ.5 వేలు మంజూరుచేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆమె వయసుకు దగ్గ ఎదుగుదల లేకపోవడంతో ఆమె పడుతున్న ఇబ్బందులను సర్పంచ్ సాదే ఆశాజ్యోతి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ద్వారా సీఎం జగన్‌ను కలిసేందుకు కృషి చేశారు. కలెక్టర్ అనుమతితో కనకమహాలక్ష్మిని సర్పంచ్ ఆశాజ్యోతి సీఎంకు పరిచయం చేసి పరిస్థితిని వివరించారు. ఈ మేరకు ఆయన తదుపరి చర్యలు తీసుకుంటూ వెంటనే ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఆశాజ్యోతి, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, ఉప సర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ తదితరులు ఆమెకు రూ.లక్ష చెక్‌ను, పీహెచ్ పింఛన్ మంజూరు ఉత్తర్వులను అందజేశారు.

అధ్యాపకుడికి నేషనల్ గ్లోబల్ టీచర్ అవార్డు



అవార్డు గ్రహీత శ్రీనివాసరావును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ లలిత, అధ్యాపకులు

తుని రూరల్: మండలంలోని కొత్తూరు శివారు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) అధ్యాపకుడు డాక్టర్ ఎ.శ్రీనివాసరావుకు నేషనల్ గ్లోబల్ టీచర్ అవార్డు లభించింది. గత నెలలో ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాసరావు అవార్డు అందుకున్నారు. అవార్డు పొందిన శ్రీనివాసరావును గురువారం కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత ఆధ్వర్యంలో అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. రసాయన శాస్త్రంలో వృత్తి నైపుణ్యం, సేవా కార్యక్రమాలకు గాను ఏకేఎస్ ఎడ్యుకేషన్స్ ఈ అవార్డును అందజేసినట్టు శ్రీనివాసరావు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ ఎస్ శ్రీధర్, రసాయనిక శాస్త్రం హెచ్ఓడీ ఢిల్లేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష

కొత్తపల్లి: మండలంలో శుక్రవారం నుంచి రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ వెంకట నారాయణ గురువారం తెలిపారు. శుక్రవారం ఉప్పాడ సచివాలయం–3లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహిస్తారన్నారు. నిపుణులైన వైద్యులు పాల్గొని రోగులకు పరీక్షలు చేస్తారన్నారు. గ్రామ ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

స్వీట్ ప్యాకెట్ల పంపిణీ



సచివాలయ సిబ్బందికి స్వీట్ ప్యాకెట్లు పంపిణీ చేసిన ఆవాల లక్ష్మీనారాయణ

సామర్లకోట: నూతన సంవత్సరం, సంక్రాంతిని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీ నారాయణ గురువారం స్వీట్ ప్యాకెట్లు పంపిణీని ప్రారంభించారు. పట్టణంలోని ప్రముఖులు, 6వ సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు స్వీట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. సంక్రాంతి వేడుకలను ఆనందంగా జరుపుకోవాలని ఆయన కోరారు.

వేమేశ్వరికి విశిష్ట మహిళా పురస్కారం



సావిత్రీబాయి పూలే విశిష్ట మహిళా పురస్కారం అందుకుంటున్న వేమేశ్వరి

ప్రత్తిపాడు: మండలంలోని ఒమ్మంగి గ్రామానికి చెందిన ఫోరం ఫర్ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్, మినీ వర్కర్స్ సంఘ రాష్ట్ర కో కన్వీనర్ ఇమంది వేమేశ్వరి విశిష్ట మహిళా పురస్కారం అందుకున్నారు. సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా విశాఖ పబ్లిక్ గ్రంథాలయం ఆవరణలో సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషన్, చారిటబుల్ ట్రస్ట్ (ఎస్‌పీఈసీటీ–స్పెక్ట్) బుధవారం రాత్రి జయంతోత్సవం నిర్వహించింది. ఈ ఉత్సవంలో స్టీల్ ప్లాంట్ సీటీఓ ఎస్.కరుణరాజు, సంగివలస మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ పీవీ సుధాకర్, స్పెక్ట్ చైర్‌పర్సన్ గుండూరు సీతామహాలక్ష్మి తదితరులు వేమేశ్వరిని శాలువాతో సత్కరించి, విశిష్ట మహిళా పురస్కారాన్ని అందజేశారు. విశిష్ట మహిళా పురస్కారం అందుకున్న వేమేశ్వరిని పలువురు అంగన్‌వాడీ వర్కర్స్ సంఘ సభ్యులు అభినందించారు.

సారా కేసులో నిందితుడికి రూ.10 వేల జరిమానా

ప్రత్తిపాడు: సారా కేసులో పలుమార్లు పట్టుబడిన నిందితుడికి ప్రత్తిపాడు తహసీల్దార్ రూ.10 వేల జరిమానా విధించారు. మండలంలోని పెద్దిపాలెం గ్రామానికి చెందిన కాండ్రేగుల కృష్ణ పలు సారా కేసుల్లో ముద్దాయిగా ఉన్నాడు. అనేక సార్లు సారా కేసుల్లో పట్టుబడిన కృష్ణను స్థానిక సెబ్ సీఐ పి.అశోక్ అరెస్టు చేసి గురువారం స్థానిక తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ వద్ద హాజరుపరచగా, తహసీల్దార్ రూ.10 వేలు జరిమానా విధించారు. ముద్దాయి కాండ్రేగుల కృష్ణ జరిమానా చలాను రూపంలో చెల్లించినట్టు సీఐ అశోక్ తెలిపారు.

ధర్మవరంలో బెల్ట్ షాపులపై దాడి

మండలంలోని ధర్మవరంలో బెల్ట్ షాపులపై దాడిచేసి పది 180 మిల్లీ లీటర్ల డ్యూటీ పేయిడ్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు గురువారం స్థానిక సెబ్ సీఐ పి.అశోక్ తెలిపారు. ఈ కేసులో అదే గ్రామానికి చెందిన ముద్దాడ నల్లబ్బాయి అదుపులోకి తీసుకున్నామని చెప్పారు.

సెబ్ దాడుల్లో ముగ్గురి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) పరిధిలోని వివిధ గ్రామాల్లో గురువారం నిర్వహించిన దాడుల్లో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక సెబ్ సీఐ పి.అశోక్ తెలిపారు. ప్రత్తిపాడు మండలం ఒమ్మంగిలో ఐదు లీటర్ల సారాతో శ్రీరంగం వెంకట సత్యనారాయణను, టి.రాయవరంలో 15 లీటర్ల సారాతో సూరంపూడి సత్యనారాయణ, ముప్పిడి శంకరయ్యలను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ ముగ్గురు నిందితులతో పాటు పలు సారా కేసుల్లో నిందితులుగా ఉన్న ధర్మవరం గ్రామానికి చెందిన మరో 11 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసి, స్థానిక తహసీల్దార్ వద్ద హాజరుపరిచినట్టు సీఐ పి.అశోక్ తెలిపారు.